సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం, 22, ఏప్రిల్, 2025



కొంప ముంచిన నకిలీ మొక్కలు
నకిలీ మొక్కలు, విత్తనాలు తమ కొంప ముంచాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తీరని నష్టం వాటిల్లినట్టు దెందులూరు మండల రైతులు లబోదిబోమంటున్నారు. 8లో ▸



ఈఏపీసెట్‌కు దరఖాస్తు ఇలా..
ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులు చదవాలనుకునే విద్యార్థులు ఈఏపీసెట్ దరఖాస్తులకు మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. 8లో ▸



బుల్లెట్టు.. వీరి టార్గెట్టు
అంతర్రాష్ట్ర బైక్ దొంగలను తణుకు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. రూ.13.40 లక్షల విలువైన 11 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸

ఆక్వా వర్సిటీకి చంద్ర గ్రహణం

విద్యపై కూటమి కత్తి
- గత ప్రభుత్వంలో జిల్లాకు తలమానికంగా ఆక్వా వర్సిటీ
- భవన నిర్మాణాలకు రూ.100 కోట్లు మంజూరు
- రెండేళ్లలో పనులు పూర్తిచేసేలా లక్ష్యం
- బిల్లుల విడుదలలో కూటమి సర్కారు జాప్యం
- ఏడాదిగా నత్తనడకన పనులు
- ప్రైవేట్‌పరం చేసే ఆలోచన ?



లిఖితపూడిలో నత్తనడకన సాగుతున్న అడ్మినిస్ట్రేటివ్ భవనం నిర్మాణ పనులు

సాక్షి, భీమవరం: జిల్లాలోని ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీకి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య గ్రహణం పట్టింది. నిధులు లేక నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. రెండేళ్లలో పూర్తికావాల్సిన పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని దుస్థితి నెలకొంది. మరో పక్క ఆక్వా వర్సిటీని ప్రైవేట్‌పరం చేసే ఆలోచనలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

ఆక్వా హబ్‌గా ఉమ్మడి జిల్లా..
ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా 2.53 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు, 40కు పైగా ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఫీడ్, సీడ్ కంపెనీలు, ఆక్వా అనుబంధ వ్యాపారాలతో ఆక్వా హబ్‌గా పేరొందింది. చేపలు, రొయ్యల మేతలు, చెరువుల నిర్వహణ సామగ్రి అమ్మకాలు, పట్టుబడి, ప్రాసెసింగ్ ప్లాంట్లు, రవాణా తదితర రూపాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలో ఆక్వాను మరింత ప్రోత్సహించే లక్ష్యంతో గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా యూనివర్సిటీని మంజూరు చేశారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురం, జిల్లాలోని ఉండిలోని ఫిషరీస్ రీసెర్చ్ స్టేషన్లను యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చారు. యూనివర్సిటీ కోసం నరసాపురం సమీపంలోని లిఖితపూడిలో 40 ఎకరాల స్థలాన్ని కేటాయించారు.

అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, క్యాంపస్ కాలేజీ, బాయ్స్, గరల్స్ హాస్టల్ భవన నిర్మాణాల నిమిత్తం రూ.100 కోట్లు మంజూరు చేశారు. తాత్కాలికంగా నరసాపురంలోని తుఫాన్ షెల్టర్ భవనంలో 2022 నవంబరు నుంచి 66 సీట్లతో బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ తరగతులను ప్రారంభించారు. గతేడాది నూతన భవనాల్లో ఆక్వా వర్సిటీ, క్యాంపస్ కళాశాలను ప్రారంభించే లక్ష్యంతో అప్పట్లో పనులు వేగవంతం చేశారు.

ఆర్‌బీకేలో సెకండ్ బ్యాచ్‌కు తరగతులు
నరసాపురంలోని 12 గదులతో ఉన్న తుఫాను షెల్టర్ భవనంలో తాత్కాలికంగా కళాశాలను నిర్వహిస్తున్నారు. తరగతి గదులు, ల్యాబ్, ఆఫీస్, లైబ్రరీ, స్టాఫ్ రూమ్ ప్రస్తుతం ఉన్న భవనం ఒక బ్యాచ్‌కు మాత్రమే సరిపోతుంది. గతేడాది సెకెండ్ బ్యాచ్‌కు క్లాసులు మొదలయ్యాయి. ప్రస్తుతం ఉన్న భవనం సరిపోక ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలోని ఫిషరీస్‌కు సంబంధించిన భవనాల్లోకి కళాశాలను తరలించాలని అధికారులు భావించారు. స్థానికంగా వ్యతిరేకత వస్తుందన్న ఉద్దేశంతో అధికార పార్టీ నేతలు ఆ ప్రయత్నాన్ని నిలిపివేసినట్టు సమాచారం. దీంతో రైతు భరోసా కేంద్రాన్ని తరగతుల నిర్వహణకు వినియోగిస్తున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో త్వరితగతిన యూనివర్సిటీ భవన నిర్మాణాలు పూర్తిచేసేందుకు పాలకులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే..



ఈ ప్రాంతంలో ఆక్వా రంగం మరింత అభివృద్ధి చెందేందుకు ఆక్వా వర్సిటీ దోహదపడుతుంది. ప్రైవేట్ సంస్థలకు ఆక్వా వర్సిటీని అప్పగించే ఆలోచన ప్రభుత్వం చేస్తున్నట్టు తెలుస్తోంది. అదే జరిగితే పేద విద్యార్థులు, రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. అటువంటి ఆలోచన ఏమైనా ఉంటే విరమించుకుని త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.
– వడ్డి రఘురాం, అప్పడా మాజీ వైస్ చైర్మన్, తాడేపల్లిగూడెం

ముందుకు సాగని పనులు

అడ్మినిస్ట్రేటివ్, కళాశాల భవనాల పనులు శ్లాబ్ దశకు చేరుకోగా బాయ్స్, గరల్స్ హాస్టల్ భవనాలకు పునాదులు పూర్తయ్యాయి. ఇప్పటివరకు రూ.35 కోట్ల విలువైన పనులు జరగ్గా కేవలం రూ.15 కోట్లు మాత్రమే బిల్లులు విడుదలయ్యాయి. తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం కేవలం రూ.20 కోట్లు మాత్రమే ఆక్వా వర్సిటీకి కేటాయించడంతో ఈ ఏడాది పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో పనులు ఎప్పుడు పూర్తవుతాయనేది చెప్పలేమని అధికార, నిర్మాణ సంస్థ వర్గాలంటున్నాయి. ఆక్వా వర్సిటీని ప్రైవేట్‌పరం చేసే ఆలోచనతోనే ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగితే గత ప్రభుత్వం ఉన్నతాశయంతో తలపెట్టిన ఈ కార్యక్రమం నీరుగారిపోతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



పునాదుల దశలోనే హాస్టల్ భవనం

సమగ్ర అభివృద్ధి లక్ష్యం

కలెక్టర్ వెట్రిసెల్వి



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్–2047 డాక్యుమెంట్ రూపొందించడంపై కలెక్టర్ కె.వెట్రిసెల్వి దిశానిర్దేశం చేశారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా నియోజకవర్గాల వారీగా స్వర్ణాంధ్ర–2047 విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించేందుకు అధికారులకు రెండు రోజుల వర్క్‌షాపు సోమవారం ప్రారంభమైంది. ఉభయ జిల్లాల చీఫ్ ప్లానింగ్ అధికారులు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ సిబ్బందికి కలెక్టర్ సూచనలు ఇచ్చారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల మనోభావాలు అనుగుణంగా యాక్షన్ ప్లాన్‌కు రూపొందించాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాల పెంపు, సుస్థిర, పర్యావరణ అనుకూలమైన వృద్ధి, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంపు, భవిష్యత్ నైపుణ్యాలు, ఉద్యోగాల కల్పన, గ్రామికశక్తిని ప్రోత్సాహం అందించడంపై దృష్టి సారించాలన్నారు. నియోజక వర్గాల వారీగా సమర్థవంతమైన ప్రణాళికలు అమలుచేయాల్సి ఉందన్నారు. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య రంగాల్లో ప్రస్తుత విస్తరణ, దిగుబడులు, రానున్న రోజుల్లో అంతర సాగు విధానం, ఆదాయం పెంపు, ప్రకృతి సాగు విస్తీర్ణం పెంపు తదితర అంశాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు. ఉమ్మడి జిల్లాల ముఖ్య ప్రణాళిక అధికారులు సీహెచ్ వాసుదేవరావు, కె.శ్రీనివాసరావు, రిటైర్డ్ జేడీ డీవీవీ సీతాపతి రావు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జికి అభినందనలు



జడ్జి శ్రీదేవికి పూలమొక్క అందిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిషోర్

ఏలూరు (టూటౌన్): జిల్లా ప్రధాన సివిల్ న్యాయమూర్తిగా (ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి) పదవీ బాధ్యతలు స్వీకరించిన సిరిపురం శ్రీదేవిని ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆమెకు పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రజల న్యాయ అవసరాలు తీర్చేందుకు సంబంధిత విభాగాల మధ్య సమన్వయంతో కేసుల విచారణ, మహిళా భద్రత, నేర నిరోధక చర్యలపై వారు చర్చించారు. పోలీస్‌శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఎస్పీ శివకిషోర్ ఆమెకు వివరించారు.

ఫిర్యాదులపై సత్వర చర్యలు



ఫిర్యాదు తీసుకుంటున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన ఫిర్యాదులపై విచారణ చేసి చట్టపరిధిలో పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి బాధితులకు భరోసా ఇచ్చారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలు ఆయన తెలుసుకున్నారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు, అత్తింటి వేధింపులు, ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు వంటి 23 అర్జీలను స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై విచారణ చేయాలని అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రీ ఓపెన్ అయిన అర్జీలపై సమీక్ష

భీమవరం(ప్రకాశం చౌక్): రీ ఓపెన్ అయినా అర్జీల విషయంలో మరింత జవాబుదారీతనం కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలు, రీ ఓపెన్ అయిన అర్జీలపై సమీక్షించారు. అధికారులు తీసుకున్న చర్యలను ఫిర్యాదుదారుడికి లేఖ ద్వారా తెలియజేయాలన్నారు. జిల్లాలో 927 ఫిర్యాదులు రీఓపెన్ కాగా 821 ఫిర్యాదులను పరిష్కరించామని, 106 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు.

పేదల ఇళ్ల కూల్చివేత దారుణం



తోకతిప్పలో నిరసన తెలుపుతున్న దృశ్యం

భీమవరం అర్బన్: పాలకోడేరులోని ఏఎస్ఆర్ నగర్‌లో 60 ఏళ్లగా 130 కుటుంబాలు ఉంటున్నాయని, వారి ఇళ్లను కూటమి ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేయడం దారుణమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్, నాయకులు ఎం.ఆంజనేయులు అన్నారు. మండలంలోని తోకతిప్పలో సోమవారం ఇళ్ల కూల్చివేతపై సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ప్రభుత్వం అని చెబుతూనే పేదల ఇళ్లను కూలగొట్టి రోడ్డున పడేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇది ప్రజాస్వామ్యమా, నియంతృత్వమా అని ప్రశ్నించారు. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు వైఖరి మార్చుకోవాలని, ప్రజలపై దాడులు మాని భూస్వాముల చేతుల్లో ఆక్రమణకు గురైన భూముల్ని వెలికితీయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరు మారకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సీపీఎం శాఖ కార్యదర్శి బొడ్డు లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి ఉపాధ్యాయులకు వైద్య శిబిరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పూర్వ పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రిఫరెన్షియల్ కేటగిరీ/స్పెషల్ పాయింట్లు పొందాల్సిన వారు వైద్య శిబిరాలకు హాజరుకావాలని డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 నుంచి 26 వరకు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా మెడికల్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుందని తెలిపారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ నాగరాణి



అర్జీలు స్వీకరించి మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశం చౌక్): ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. భూమి, ఇళ్లు, సరిహద్దులు, పెన్షన్లు, రేషన్‌కార్డులు, పోలీసు కేసులు, రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు తదితర సమస్యలపై 237 అర్జీలు వచ్చాయి. జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, వృద్ధుల అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

కుమారుడికి పెన్షన్ కోసం..



అత్తిలి మండలం అరవల్లి గ్రామానికి చెందిన మల్లిడి సురేఖ దంపతుల కుమారుడు ఆరేళ్ల వయసు నుంచి మానసిక, శారీరక దివ్యాంగుడిగా ఉన్నాడు. అకస్మాత్తుగా పడిపోతూ ఉండటంతో తల్లితండ్రులు అనుక్షణం అందుబాటులో ఉండాల్సి ఉంటోంది. బెంగళూరు, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వైద్యం కోసం తీసుకువెళ్లడం, ప్రతినెలా మందులు, ఇతర ఖర్చులకు రూ.15 వేల వరకు ఖర్చవుతున్నాయి. దీంతో కూలీ పనులపై బతికే సురేఖ దంపతులకు కుమారుడి వైద్య ఖర్చులు భారంగా మారాయి. ఈ నేపథ్యంలో తమ కుమారుడికి రూ.15 వేలు పెన్షన్, ట్రైసైకిల్ మంజూరు చేయాలని సురేఖ దంపతులు కలెక్టర్‌ను కలిసి కోరారు.

శ్మశాన వాటిక అభివృద్ధి కోసం..



ఉండిలోని పడవలవానిపేట శ్మశాన వాటికలో చెత్తాచెదారం పారవేసి డంపింగ్ యార్డ్‌గా మారుస్తారని, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు పీజీఆర్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే శ్మశానవాటిక పల్లంగా ఉండటంతో వర్షం నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని, శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

మంచినీళ్లు లేక ఇబ్బందులు



పెంటపాడు మండలం పడమర విప్పర్రులోని న్యూ హౌసింగ్ కాలనీలో 40 కుటుంబాల వరకు ఉన్నాయని, తాగడానికి నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామంటూ ఆ ప్రాంత మహిళలు కలెక్టర్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో మంచినీటి పైపులైన్ వేయలేదని, దీంతో రెండు కిలోమీటర్లు దూరం వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కరించాలంటూ అర్జీ అందించారు.

పోలీసుల క్యూఆర్ కోడ్ ప్రారంభం



క్యూ ఆర్ కోడ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: గంజాయి, మాదక ద్రవ్యాలు ఇలా ఏదైనా సమాచారం పోలీసులకు తెలియజేసేందుకు క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. భీమవరం వన్‌టౌన్ స్టేషన్‌లో సోమవారం క్యూఆర్ కోడ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కోడ్‌ను స్కాన్ చేయగానే లింక్ వస్తుందని, అందులో వివరాలు చెబితే సర్వర్‌లోకి చేరతాయన్నారు. ఇలా నమోదైన వివరాలను పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి సంబంధిత స్టేషన్లకు పంపించి విచారణ చేస్తారన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని ఎస్పీ తెలిపారు. డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, సీఐలు ఎం. నాగరాజు, జి.కాళీచరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య

భీమవరం: ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులచే విద్యను నేర్చుకుని విద్యార్థులు ప్రయోజకులు కావాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆకాంక్షించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధనపై రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మాత్రమే ఉంటారని, నిర్ణీత విద్యార్హతలతో పాటు పోటీ పరీక్షల్లో అర్హత సాధించిన వారినే ప్రభుత్వం నియమిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు డిజిటల్ విద్యాబోధన, స్మార్ట్ టీవీలు, ఆట స్థలాలు, ఇండోర్ కోర్టులు, మ్యాథ్స్ ల్యాబ్‌లు, సైన్స్ ప్రయోగాలు వంటివి ఉన్నాయన్నారు. పోషకాహారం కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తారని, విద్యాసామగ్రి, యూనిఫాం, పుస్తకాలు ఉచితంగా అందిస్తారన్నారు. డీఈఓ నారాయణ పాల్గొన్నారు.

పద్మ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్: 2026 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం అందించనున్న పద్మ విభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలకు జిల్లా క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ క్రీడల్లో రాణించిన క్రీడాకారులు అర్హులని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధిత పత్రాలు, వివరాలను మే 26న సాయంత్రం లోపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ మెయిల్‌కు పంపించాలని సూచించారు. శాప్ అధికారులు పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తారన్నారు.

స్పోర్ట్స్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సు
భారత క్రీడా ప్రాధికార సంస్థ పాటియాలలో ఎంఎస్‌సీ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోర్సులు నిర్వహిస్తుందని, ఆసక్తి గల వారు మే 2లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డీఎస్సీకి దరఖాస్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1,035 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందని ఏలూరు డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మే 15 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 6 నుంచి జూలై 6 వరకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వివరాలు సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్, ఏపీడీఎస్సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో అందుబాటులో ఉంచారని డీఈఓ తెలిపారు.

నేడు సంతాప దినం



పోప్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫాదర్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పోప్ ఫ్రాన్సిస్ మరణంతో ఏలూరు పీఠం మంగళవారం సంతాప దినంగా పాటిస్తుందని ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు ప్రకటించారు. పోప్ మరణ వార్త వినగానే ఏలూరు పీఠం శోకసముద్రంలో మునిగిపోయిందన్నారు. పోప్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు అమలోద్భవీ మాత దేవాలయ ప్రాంగణంలో దివ్య బలిపూజను సమర్పిస్తామని ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ బాల తెలిపారు. బిషప్ హౌస్‌లో జరిగిన సంతాప కార్యక్రమంలో ఫాదర్ మైఖేల్ ఇంజమాల, ఫాదర్ బాబు జార్జ్, ఫాదర్ బి.రాజు, ఫాదర్ టి.ఇమ్మానియేలు పోప్ చిత్రటం వద్ద నివాళర్పించారు.

సూపర్ సిక్స్ అమలెప్పుడు బాబూ?



అడ్డబిడ్డ నిధి ఎప్పుడిస్తారు అంటూ మహిళలు.. తల్లికి వందనం ఎక్కడ? ఎప్పుడు? అంటూ విద్యార్థులు నినదించారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా సూపర్‌సిక్స్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
– ఏలూరు (టూటౌన్)



సివిల్ రైట్స్ దినోత్సవం

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగం ప్రకారం పౌరులంతా సమానమేనని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ అన్నారు. స్థానిక నారాయణపేటలో సోమవారం సివిల్ రైట్స్ దినోత్సవంలో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం మండలంలోని పల్లం గ్రామంలో ఎస్సీ సామాజికవర్గం వారిని సాంఘిక బహిష్కరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఇందుకు బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. డిప్యూటీ సీఎం నియోజకవర్గంలో ఇలా జరగడం విచారకరమన్నారు. బాధితులకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. నూకపెయ్యి కార్తీక్, సీహెచ్ సుబ్బారావు, వి.నాగరాజు, మహిళలు పాల్గొన్నారు.

చెరువు పూడిక తీత పనులు



సాక్షి స్పందన

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర పరిధిలోని 13వ డివిజన్ పోణంగి రోడ్డులోని కమిటేటి కుంట చెరువు పూడిక పనులను అధికారులు చేపట్టారు. గత నెల 26న 'సాక్షి'లో 'కళ తప్పిన కమిటేటి కుంట చెరువు' శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందించారు. మూడు రోజులుగా పనులు చేస్తున్నామని, పనులు పూర్తయిన తర్వాత పూర్తిస్థాయిలో నీటితో నింపి చెరువును వినియోగంలోకి తీసుకువస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు.

క్లుప్తంగా

పోగొట్టుకున్న బ్రాస్‌లెట్ భక్తుడికి అప్పగింత



బ్రాస్‌లెట్‌ను దుర్గాప్రసాద్‌కు అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఆలయ పరిసరాల్లో పోగొట్టుకున్న బంగారు బ్రాస్‌లెట్‌ను సోమవారం బాధితుడికి నూకాలమ్మ ఆలయ కమిటీ అందజేసింది. మూడు రోజుల క్రితం కొప్పుల దుర్గాప్రసాద్, అశ్విని దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు. దర్శనం అనంతరం తిరిగి వెళుతున్న సమయంలో చేతికి ఉన్న బ్రాస్‌లెట్ కనిపించకపోవడంతో ఆలయ కమిటీకి తెలియజేసి దొరికితే ఇప్పించాలని దుర్గాప్రసాద్ కోరాడు. ఆలయ సమీపంలో నివసించే మహాలక్ష్మికి ఈ బ్రాస్‌లెట్ దొరకగా ఎవరిదో విచారించి వారికి ఇవ్వాలని ఆలయ కమిటీని కోరింది. సోమవారం దుర్గాప్రసాద్ దంపతులకు మహాలక్ష్మి చేతుల మీదుగా బ్రాస్‌లెట్‌ను ఆలయ కమిటీ అందజేసింది. మహాలక్ష్మిని అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. కాగా బ్రాస్‌లెట్ విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది.

ఉప ముఖ్యమంత్రి ఇలాకాలో సాంఘిక బహిష్కరణ సిగ్గుచేటు

దెందులూరు: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలోని మల్లం గ్రామంలో దళిత కుటుంబాన్ని పెత్తందారులు సామాజిక బహిష్కరణ చేయడం సిగ్గుచేటని దళిత ప్రజా ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సర్క్యూట్ వల్ల దళితుడు సురేష్ మృతి చెందడం, అతనికి న్యాయం చేయాలని దళితులు, గ్రామస్తులు గ్రామంలో ర్యాలీ నిర్వహించడం నేరమా అని ప్రశ్నించారు. ఘటన జరిగి ఇన్ని రోజులైనా బాధిత కుటుంబాన్ని పవన్‌కళ్యాణ్ పరామర్శించకపోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు నాకు ఓటేయండి, నన్ను గెలిపించండి దేశమంతా తలెత్తుకొని చూసేలా చేస్తానని అన్ని మీటింగ్‌లో చెప్పారని, దాని అర్థం ఇదేనా అని దళిత ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. దళిత కుటుంబాన్ని వెలివేసిన వారిని, ఇందుకు సహకరించిన వారిని జిల్లా బహిష్కరణ చేసి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 48 గంటల్లోగా ఈ ఘటనపై పవన్‌కళ్యాణ్ చర్యలు తీసుకోకుంటే భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటిస్తామని దళిత ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ఏలూరు జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తెర ఆనంద్, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లం ప్రసాద్, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు మోరు రామరాజు, పార్టీ జిల్లా కార్యదర్శులు గొల్ల కిరణ్ దేవదాసు ప్రేమ్ బాబు ఉన్నారు.

ఈఏపీ సెట్‌కు దరఖాస్తు ఇలా..

- మూడు రోజుల్లో ముగియనున్న గడువు..
- దరఖాస్తులు ఆన్‌లైన్‌లోనే సమర్పించాలి



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులు చదవాలనుకునే విద్యార్థులు తమ తొలి అడుగు వేయడానికి మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. ఆయా కోర్సుల్లో ప్రవేశించడానికి గతంలో ఎంసెట్ నిర్వహించేవారు. ఎంసెట్ ద్వారా వైద్య విద్యలో కూడా ప్రవేశించే వెసులుబాటు ఉండేది. అనంతరం జరిగిన పరిణామాల్లో భాగంగా వైద్య విద్య ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నీట్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు మాత్రం రాష్ట్రస్థాయిలోనే ఏపీ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈఏపీ సెట్) నిర్వహిస్తున్నారు. ఆయా కోర్సుల్లో ప్రవేశించడానికి ఈఏపీ సెట్ పరీక్ష రాయడం తప్పనిసరి. ఈ ప్రవేశ పరీక్ష రాయడానికి ఇప్పటికే ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయగా, షెడ్యూల్ ప్రకారం ఈ నెల 24వ తేదీతో దరఖాస్తు చేసుకోవడానికి గడువు ముగియనుంది. వివిధ కారణాల వల్ల ఇప్పటి వరకూ దరఖాస్తు చేసుకోలేని వారు ఇప్పుడు తొందరపడకపోతే తమ ఇంజనీరింగ్ చదువు కలగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. లేదా తమ తోటివారికంటే ఒక ఏడాది ఆలస్యంగా ప్రవేశించాల్సి వస్తుంది. ఏపీ ఈఏపీ సెట్లో అర్హత సాధించిన విద్యార్థులు తమ ర్యాంకు ఆధారంగా జిల్లాతోపాటు రాష్ట్రంలో ఎక్కడైనా ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశం పొందవచ్చు.

దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించాలి

ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు సీఈటీఎస్.ఏపీఆర్‌సీహెచ్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి ఏపీ ఈఏపీసెట్–2025ను ఎంపిక చేసుకోవాలి. ఏపీఈ ఏపీసెట్ సైట్లో పరీక్ష రాసేందుకు అర్హతలు, దరఖాస్తు ప్రక్రియతో పాటు కోర్సుల వివరాలు, ఏపీ ఈఏపీ సెట్‌కు సంబంధించిన తేదీలు, సూచనలు తదితర పూర్తి వివరాలు పొందవచ్చు.

ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవడం మరువద్దు

ఈ పరీక్షకు దరఖాస్తు చేసే సమయంలో వివిధ కేటగిరీల పరిధిలోకి వచ్చే విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవడం మరిచిపోవద్దు. ముఖ్యంగా ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, పీహెచ్‌సీ కేటగిరిల వారీగా తమ సామాజిక వర్గాన్ని ఎంపిక చేసుకుని ఆన్‌లైన్ అప్లికేషన్‌లో క్లిక్ చేయాలి. అలాగే ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన నంబర్‌ను దరఖాస్తులో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈడబ్ల్యూఎస్, ఆదాయ ధ్రువపత్రాల నంబరును సైతం విధిగా నమోదు చేయాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1వ తేదీ తరువాత తీసుకున్న ధ్రువీకరణ పత్రాలను పరిగణనలోకి తీసుకున్నారు. విద్యార్థుల స్థానికత నిర్ధారణకు 6వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకు ఏ విద్యా సంస్థల్లో చదివారు, ఏ ఊరిలో చదివారనే వివరాలు ఆయా విద్యా సంవత్సరాల వారీగా నమోదు చేయాలి. చివరలో ఏపీ ఈఏపీ సెట్ పరీక్ష ఏ జిల్లాలో రాస్తారనే సమాచారంతో కూడిన ట్యాబ్‌లను ప్రాధాన్యత క్రమంలో క్లిక్ చేయాలి. ఈ విధంగా ఐదు ప్రాధాన్యతలను క్లిక్ చేయాల్సి ఉంటుంది. సొంత జిల్లాకు చెందిన విద్యార్థి తమ సొంత జిల్లాలో పరీక్ష రాసేందుకు ఆప్షన్ ఎంచుకున్నప్పటికీ అక్కడి పరీక్షా కేంద్రంలో పరిమితి మించిపోవడం, ఇతర కారణాలతో పరీక్షా కేంద్రం అందుబాటులో లేని పక్షంలో తరువాత వరుస క్రమంలో ఇచ్చిన ప్రాధాన్యతల వారీగా ఆయా జిల్లాలో పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తారు.

ప్రింటౌట్ తీసుకోండి

ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేసి సబ్మిట్ చేసిన తరువాత ప్రింటౌట్ తీసుకోవాలి. పరీక్ష జరిగే రోజున ఏపీ ఈఏపీ సెట్ హాల్ టికెట్‌తో పాటు ఆన్‌లైన్ ప్రింటౌట్ కాపీపై ఫొటో అంటించి పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్‌కు అందజేయాలి. ఫీజు చెల్లించే సమయంలో ఇచ్చిన రిఫరెన్స్ ఐడీ, విద్యార్థి పేరు, సీనియర్ ఇంటర్ హాల్ టికెట్, పుట్టిన తేదీ వివరాలతో భవిష్యత్తులో ఈఏపీ సెట్ హాల్ టికెట్, పరీక్షకు హాజరయ్యే సమయంలో సంబంధిత వివరాలు కీలకంగా మారుతాయి కనుక జాగ్రత్తగా ఉంచుకోవాలి.

5 దశలుగా దరఖాస్తు ప్రక్రియ

ఏపీఈఏపీ సెట్–2025 సైట్‌లో లాగిన్ అయిన తరువాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు ఐదు దశల్లోని ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎలిజిబిలిటీ క్రైటీరియా అండ్ ఫీజు పేమెంట్‌కు లాగిన్ అయి సీనియర్ ఇంటర్ హాల్ టికెట్ నెంబర్ ఎంటర్ చేయాలి. విద్యార్థి పుట్టిన తేదీ, మొబైల్ నెంబర్, ప్రత్యామ్నాయ మొబైల్ నెంబర్, ఈ మెయిల్ ఐడీ నమోదు చేయాలి. దీంతోపాటు ఇంజనీరింగ్ ఫార్మా, అగ్రికల్చర్ ఫార్మసీ, బోత్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీల వారీగా తాము రాయబోయే ప్రవేశ పరీక్ష, చేరనున్న కోర్సుల వారీగా మూడు ఆప్షన్లలో ఒక దానిని ఎంపిక చేసుకుని క్లిక్ చేయాలి. తరువాత సామాజిక వర్గాల వారీగా కేటగిరిపై క్లిక్ చేసి ఆన్‌లైన్ ఫీజు పేమెంట్ చేయాలి. క్రెడిట్, డెబిట్‌కార్డు, నెట్ బ్యాంకింగ్ ద్వారా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

నో యువర్ పేమెంట్ స్టేటస్‌పై క్లిక్ చేసి సీనియర్ ఇంటర్ హాల్ టికెట్ నెంబర్, మొబైల్ నెంబర్, పుట్టిన తేదీ వివరాలు పూర్తి చేయాలి. అనంతరం విద్యార్థి చేరనున్న కోర్సుల వారీగా ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్లలో ఏదైనా ఒక దానిని ఎంపిక చేసుకుని క్లిక్ చేయడంతో దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది.

ఫిల్ అప్లికేషన్లో పేమెంట్ చేసిన ఐడీతోపాటు సీనియర్ ఇంటర్ హాల్‌టికెట్ నెంబర్, పుట్టినతేదీ వివరాలు నమోదు చేయాలి. అనంతరం ప్రొసీడ్ టు ఫిల్ అప్లికేషన్‌పై క్లిక్ చేయాలి.

ఇక్కడ నో యువర్ అప్లికేషన్ స్టేటస్‌పై క్లిక్ చేసి పూర్తి చేసిన దరఖాస్తు ఫారాన్ని సందర్శించవచ్చు.

ఇక్కడ్ క్లిక్ చేసి ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేసిన దరఖాస్తు ఫారాన్ని ప్రింట్ తీసుకుని భద్రపరచుకోవాలి.

పిఠాపురంలో వెలివేసిన దళిత కుటుంబాలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం మండలం మల్లం గ్రామంలో అగ్రవర్ణాలకు చెందిన వారు వెలివేసిన దళితులను ఆదుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం నియోజకవర్గంలో ఇలా జరగడం శోచనీయం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులు, క్రైస్తవుల మీద దాడులు ఎక్కువ య్యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెలివేసిన దళితులను ఆదుకుని, ఈ నేరానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉన్నమట్ల యేసురత్నం, సుంకర ప్రియబాబు, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఆరుగురి అరెస్ట్

ఉంగుటూరు: చోరీ కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ తెలిపిన వివరాల ప్రకారం రాచూరు, చుట్టుపక్కల గ్రామాల చెరువుల మీద మేత బస్తాలు చోరీ జరుగుతున్నాయని చెరువుల యజమాని నడింపల్లి రామాంజనేయ వర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నిందితులు సీతారాంపురానికి చెందిన బైరపూడి హరికృష్ణ, వనపర్తి సహదేవుడు, తాడేపల్లి వెంకట కుమార్, జుత్తుక ధనుష్, జుత్తుక పవన్ కుమార్, నబిగేరి జయరాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సూర్యభగవాన్ చెప్పారు.

బుల్లెట్టు.. వీరి టార్గెట్టు

- అంతర్రాష్ట్ర బైక్ దొంగల అరెస్టు
- రూ.13.40 లక్షల విలువైన 11 బైక్‌ల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ విశ్వనాథ్



నిందితులు, స్వాధీనం చేసుకున్న బైక్‌లతో డీఎస్పీ విశ్వనాథ్, సీఐ కృష్ణకుమార్ తదితరులు

తణుకు అర్బన్: అంతర్రాష్ట్ర బైక్ దొంగలను తణుకు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్, రూరల్ సీఐ బి.కృష్ణకుమార్ చోరీలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో రాత్రి సమయాల్లో ఇళ్ల ముందు పెట్టిన వాహనాలను మాయం చేస్తున్న దొంగతనాలకు సంబంధించి తణుకు పాతవూరుకు చెందిన గుడాల లక్ష్మీనారాయణ అలియాస్ లక్కీ, తణుకు మండలం కొమరవరం గ్రామానికి చెందిన బొంత రవితేజ, హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన దాసరి మణిబాబు అలియాస్ చింటులను సోమవారం తణుకులో అరెస్టు చేసి రూ.13.40 లక్షలు విలువైన 11 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు తణుకులో ఇటీవల జరిగిన మూడు బైక్ దొంగతనాలకు సంబంధించి జరిపిన విచారణలో భాగంగా అనుమానితులను అదుపులోకి తీసుకుని తెలంగాణలోని జీడిమెట్ల, సూరారం, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్, పోడూరు, నిడదవోలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని చోరీలకు సంబంధించి బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో బుల్లెట్ వాహనాలే అధికంగా ఉండడం, బుల్లెట్ వాహనాలే వీరి లక్ష్యంగా ఎంచుకున్నారని స్పష్టం చేశారు. నిందితుల ఆచూకీతోపాటు చోరీలకు సంబంధించిన వాహనాలను రికవరీ చేయడంలో కీలకంగా వ్యవహరించిన తణుకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్, ఏఎస్సై పి.సంగీతరావు, హెడ్‌కానిస్టేబుల్ బి.శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ఎస్‌కే అన్వర్, ఎం.శ్రీనివాస్, వి.మాధవరావు, ఎస్.భాస్కరాచారిలను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

అగ్నిమాపక సిబ్బంది ఔదార్యం

బావిలో పడ్డ శునకాల్ని బయటికి తీసిన వైనం




బావిలో నుంచి శునకాలను బయటికి తీయడానికి ప్రయత్నిస్తున్న ఫైర్ సిబ్బంది

చింతలపూడి: ప్రమాదవశాత్తూ నేల బావిలో పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న రెండు శునకాలను గ్రామస్తుల సహకారంతో అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. చింతలపూడి మండలం, శెట్టివారిగూడెం గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. శెట్టివారిగూడెం పొలాల్లో ఉన్న ఇరవై అడుగుల బావిలో రెండు కుక్కలు ప్రమాదవశాత్తూ పడిపోయాయి. బావి నుంచి కుక్కల అరుపులు విన్న రైతులు వాటిని బయటికి తీయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. చివరికి చింతలపూడి అగ్నిమాపక కేంద్ర అధికారి వెంకటరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో సిబ్బందిని బావి దగ్గరకు పంపించారు. ఫైర్‌మెన్ రామకృష్ణ, ఫైర్ హోంగార్డ్ బాబురావు బావిలోకి దిగి కుక్కల్ని సురక్షితంగా బయటికి తీశారు. సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించి మూగ జీవాల ప్రాణాలు కాపాడిన ఫైర్ సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

కొంపముంచిన నకిలీ మొక్కలు



పుచ్చతోటలో రైతు బోప్పన శ్రీను



పామాయిల్ చెట్టు వద్ద ఖమ్మ బ్రహ్మాజీ

గగ్గోలు పెడుతున్న రైతన్నలు

దెందులూరు: నకిలీ మొక్కలు, విత్తనాలు తమ కొంప ముంచాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తే తీరని నష్టం కలిగిందని లబోదిబోమంటున్నారు. దెందులూరు మండలం చల్లచింతలపూడి గ్రామంలో ఖమ్మ బ్రహ్మాజీ తన ఐదెకరాల పొలంలో ఒక మొక్క రూ.211 చొప్పున 337 పామాయిల్ మొక్కలు రూ.71 వేలకు 2018లో ఓ ప్రైవేటు కంపెనీ నుంచి కొనుగోలు చేసి సాగు చేశాడు. మొత్తం 36 మొక్కలు బెరుకు మొక్కలు వచ్చాయని, దీంతో వేలాది రూపాయలు పెట్టుబడి వృథా అయ్యిందని, నకిలీ విత్తనాలు తన పాలిట శాపంగా మారాయని రైతు బ్రహ్మాజీ కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై రెండు రోజుల్లో హార్టికల్చర్ శాఖ, విజిలెన్స్ అధికారులు చర్యలు తీసుకోకుంటే తన పొలంలోనే దీక్షలు చేస్తానని హెచ్చరించారు. హార్టికల్చర్ ఆఫీసర్ కరణ్ స్పందిస్తూ పామాయిల్ సాగులో బెరుకు మొక్కలు వచ్చిన సంగతి వాస్తవమే అన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. మరోవైపు ఇదే గ్రామంలో పుచ్చ విత్తనాలు తనకు నష్టం మిగిల్చాయని రైతు బోప్పన శ్రీను కన్నీటి పర్యంతమయ్యాడు. తనకున్న రెండున్నర ఎకరాల్లో రూ.22 వేలతో పుచ్చ విత్తనాలు వేశానని, సాగు, డ్రిప్పు మల్చింగ్ నిమిత్తం రూ.55 వేలు పెట్టుబడి పెట్టానని, కానీ 40 శాతం మాత్రమే మొలకలు వచ్చాయని వాపోయాడు. నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసగిస్తున్న కంపెనీలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

24 నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు



భీమవరంలో నాటిక పోటీల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని చైతన్య భారతి సంగీత నృత్య నాటక పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ నుంచి 18వ జాతీయస్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు చైతన్య భారతి వ్యవస్థాపక అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ చెప్పారు. సోమవారం భీమవరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నాటిక పోటీల వివరాలను వెల్లడించారు. పట్టణంలోని డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై నాలుగు రోజులు పాటు నాటిక పోటీలు నిర్వహిస్తామన్నారు. 24న ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి ×కిడ్నాప్ష, మైత్రి కళానిలయం హైదరాబాద్ వారి 'బ్రహ్మ స్వరూపం ౹,' 25న యువభేరీ థియేటర్ ఆర్గనైజేషన్ వారి 'నా శత్రువు', అమరావతి ఆర్ట్స్ వారి ' చిగురు మేఘం౹, మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్ చిలకలూరిపేట వారి 'మా ఇంట్లో మహాభారతం', 26న మహతి క్రియేషన్ హైదరాబాద్ వారి 'ఉక్కు సంకెళ్ళు', చైతన్య కళా స్రవంతి విశాఖ వారి '(అ) సత్యం', మిత్రా క్రియేషన్ హైదరాబాద్ వారి 'ఇది రహదారి కాదు' నాటికల ప్రదర్శన ఉంటుంది. 27న అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి 'విడాకులు కావాలి', సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి 'జనరల్ బోగీలు' నాటికలను ప్రదర్శిస్తారని భగవాన్ వివరించారు. అలాగే కళాకారులకు పురస్కారాలు అందిస్తామన్నారు. విలేకర్ల సమావేశంలో నాటక పరిషత్ కార్యదర్శి మంతెన రామకుమార్‌రాజు, పీఆర్‌ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు, కోశాధికారి బొండా రాంబాబు, వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు, పేరిచర్ల లక్ష్మణవర్మ, వడుపు గోపి, కట్రెడ్డి సత్యనారాయణ, నడింపల్లి మహేష్, పెన్నాడ శ్రీను, చెరుకుపల్లి రవి తదితరులు పాల్గొన్నారు. నాటిక పోటీల ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులు హాజరవుతారని భగవాన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెదపాడు: ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందిన ఘటన పెదపాడు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎద్దు వేదప్రకాష్ (38) తన స్థలంలో ఇంటి నిర్మాణానికి వాటరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై మృతి చెందాడు. వేదప్రకాష్ మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రకాష్‌కు భార్య ఒక పాప ఉన్నారు. ఫార్మసీ చదివిన ప్రకాష్ వైద్యురాలు అయిన భార్యతో కలిసి హెల్త్ క్లినిక్ నిర్వహిస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ఇరువురికి రిమాండ్

భీమవరం: హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులకు కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్సై ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ తెలిపారు. భీమవరం ఒకటో పట్టణం చినపేటలో ఈనెల 19న డి.రాజు అనే వ్యక్తిపై హత్యాయత్నం జరిగిందని, ఈ కేసులో నిందితులు కె.విక్టరా బాబు, ఎన్.క్రాంతిని అరెస్టు చేసి భీమవరం రెండో ఏజేఎఫ్సీఎం కోర్టులో సోమవారం హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు చెప్పారు. అలాగే గత ఏడాది డిసెంబరు 10న యు.హేమంత్ శామ్యూల్స్‌పై దౌర్జన్యం చేసి డబ్బు, ఫోన్ లాక్కొన్న కేసులో కె.మహేష్‌ను ఎస్సై ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ అరెస్టు చేశారు. భీమవరం రెండో ఏజేఎఫ్సీఎం న్యాయస్థానంలో నిందితుడిని హాజరుపరచగా కోర్టు 14 రోజుల రిమాండు విధించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ సంస్థల ఉద్యోగులకు పెన్షన్, జీపీఎఫ్ కల్పించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యుత్ సంస్థల ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటుగా పెన్షన్, జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని విద్యుత్ ఉద్యోగుల జీపీఎఫ్ సాధన సమితి ఉమ్మడి డిమాండ్ చేసింది. ఈమేరకు జిల్లా పర్యటనకు సోమవారం సాయంత్రం నగరానికి వచ్చిన రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సంఘ అధ్యక్షుడు పి శ్రీనివాస్, కన్వీనర్ కే కృష్ణకుమార్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్, 1980 ని సవరించి 2004 సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్ర – ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమును అమలులోకి తెచ్చినా విద్యుత్ ఉద్యోగులు మాత్రం జీపీఎఫ్ పరిధిలోనే ఉన్నారన్నారు. దీనివల్ల 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 ఆగస్టు 31 మధ్య ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థల్లో నియమతులైన సుమారు 6,200 మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అంతేకాకుండా, ఉద్యోగ నిర్వహణలో భాగంగా ప్రమాదాలకు గురై మరణించిన ఉద్యోగుల కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంతో వీధిన పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్ 1980 ప్రకారం పెన్షన్ సౌకర్యం, జీపీఎఫ్ సౌకర్యం విద్యుత్ ఉద్యోగులకు అందరికీ కల్పించాలని మంత్రిని కోరారు.

ముగ్గురు రైల్వే ఉద్యోగులకు జీఎం సేఫ్టీ అవార్డులు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): రైళ్ల నిర్వహణలో లోపాలను గుర్తించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించిన విజయవాడ డివిజన్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులు ×జీఎం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ అవార్డును అందుకున్నారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి విజయవాడ డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో పాటుగా సికింద్రాబాద్, హైదరాబాద్, గుంటూరు, గుంతకల్లు, నాందేడ్ డివిజన్‌ల డీఆర్‌ఎంలతో వర్చువల్ పద్ధతిలో భద్రతపై దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రయాణికుల సురక్షిత ప్రయాణం, భద్రతలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించిన దెందులూరు ఆపరేటింగ్ విభాగంలోని స్టేషన్ సూపరింటెండెంట్ టీవీఎంయూ మహేశ్వర్, రాజమండ్రి ఆపరేటింగ్ విభాగంలోని పాయింట్ మెన్ కె.నథానియేల్, రాజమండ్రిలోని ట్రైన్ మేనేజర్ లోకేష్‌కుమార్‌లకు జీఎం అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు.

నాగులదేవునిపాడులో ఘర్షణ.. ముగ్గురికి గాయాలు

దెందులూరు: గాలాయిగూడెం పంచాయతీ నాగులదేవునిపాడు గ్రామంలో ఇరుకుటుంబాల మధ్య ఏర్పడిన ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్సై ఆర్ శివాజీ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి మురుగునీటి విషయంలో రెండు కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదం ఘర్షణకు దారితీసిందన్నారు. గుజ్జుల నాగేంద్రబాబు చాకుతో గూడపాటి చందు, గూడపాటి జోషిలపై దాడికి పాల్పడగా.. జోషి కుమారుడు సుమంత్ రాయితో గుజ్జుల నాగేంద్రబాబుపై దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన ముగ్గురిని అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించమన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివాజీ తెలిపారు.



క్లుప్తంగా

ఘనంగా చల్లాలమ్మ గ్రామోత్సవం



కొమ్ముగూడెం గ్రామంలో చల్లాలమ్మ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో చల్లాలమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భవిత విద్యార్థులకు స్టీల్ బాటిల్స్ అందజేత



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవత స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో స్థానిక భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో సోమవారం 40 మంది విద్యార్థులకు స్టీల్ బాటిల్లు అందజేశారు. మానవతా శాఖ అధ్యక్షుడు పచ్చ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఎర్ర ఆంజనేయస్వామి, రాజేంద్ర కుమార్, భవిత ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాల ఈశ్వరయ్య, చేకూరి బంగార్రాజు, పాండురంగారావు, హరికుమార్, కేవీ రామారావు, వెంకటాచలం, సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎన్సీసీ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ సోమవారం జెడ్పీ స్కూల్ ఎన్సీసీ విద్యార్థులచే ఎన్రోల్మెంట్ డ్రైవ్ జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు ఉన్నాయని, నాణ్యమైన విద్యను అందజేస్తున్నట్లు ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కరపత్రాలను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మైనం సత్యనారాయణ, ఎన్సీసీ అధికారి కేవీ గణపతిరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 వినతులు



గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎంఈజీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక మునిసిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వేదికకు 11వినతులు అందాయి. టౌన్ ప్లానింగ్‌కు 4, ఇంజనీరింగ్ 3, రెవెన్యూ 2, పింఛన్, రైస్ కార్డుకు 2 వినతులు అందాయి. ఎంఈఓ వెంకట రమణ, మునిసిపల్ మేనేజర్ రవి సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సేవలు భేష్



తణుకులో విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్: దాతల సహకారంతో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేసన్ సేవలు అభినందనీయమని అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి తెలిపారు. తణుకు అసోసియేషన్ భవనంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ సభ్యులు అక్కిన బాపినీడు ఆర్థికసాయంతో హైదరాబాద్ లయోలా అకాడమీలో బీఎస్సీ కంప్యూటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ర్యాలి హర్షిణికి రూ. 25వేలు విలువచేసే ల్యాప్‌టాప్‌ను, డాక్టర్ కేవీ రావు ఇండియా నెట్‌వర్క్ ఫౌండేషన్ అమెరికా సంస్థ ఆర్థిక సాయంతో రూ. 5వేలు విలువచేసే ట్రైసైకిల్‌ను అబ్దుల్ గపూర్‌కు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ఉపాధ్యక్షుడు నల్లజర్ల వెంకన్న, భారతీ రాధాకృష్ణ, కార్యదర్శి ఎండీ స్వాలిహా తదితరులు పాల్గొన్నారు.

కల్లాలు లేక అవస్థలు

- రహదారులపై కుప్పలుగా పోసిన ధాన్యం
- తేమ శాతం తగ్గించేందుకు ఆరబోత
- యంత్రాలతో వరి కోతలే కారణం



పెంటపాడు మండలంలో రోడ్డుపై ధాన్యం అరబెడుతున్న రైతులు



రోడ్డుపై ఉంచిన ధాన్యం

పెంటపాడు: ఒకప్పుడు పల్లెలో కల్లాలు చూసినా విరివిగా ఉండేవి. వరి మాసూళ్లు అక్కడే జరిగేవి. కాలక్రమంలో కల్లాల జాడ లేకుండా పోయింది. దీంతో రైతులు రోడ్లపైనే ధాన్యం అరబెట్టుకోవాల్సి వస్తోంది. ఏ రహదారి చూసినా ధాన్యం కల్లాలుగా మారాయి. ఒకప్పుడు వరి పొలాల్లో కల్లాలు చేసుకొని, ధాన్యం నూర్పిళ్లు చేస్తే ఇప్పుడు మారిన పరిస్థితులు దృష్ట్యా రహదారులపై ధాన్యాన్ని అరబెట్టుకోవాల్సిన పరిస్థితి అన్నదాతలకు ఎదురవుతోంది. కుప్ప నూర్పిళ్లు చేసిన అనంతరం ధాన్యాన్ని రైతులు అమ్ముకోవడం, హెచ్చు ధర కోసం గాదుల్లో పోసుకోవడం వంటివి రైతులు చేసుకునేవారు. ఇప్పుడు రైతులు ధాన్యాన్ని అరబెట్టుకున్న తర్వాతే ఏ పనైనా చేయాల్సి వస్తుంది. యంత్రాలతో వరికోతలు చేపట్టడమే ఇందుకు ప్రధాన కారణం. యంత్రాలతో వరికోతలు చేపట్టడం వల్ల ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉండడంతో రైతులు ప్రస్తుతం ఆధాన్యాన్ని అరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

95 శాతం యంత్రాలతోనే

సాధారణ పద్ధతిలో రైతులు వరి కోతలు కోసి, వరి పనలను కుప్పలుగా వేసేవారు. కుప్పలే వేసి 15 నుంచి 30రోజుల్లో కుప్పలు నూరుస్తారు. దీనివల్ల తేమ శాతం బాగా తగ్గుతుంది. ప్రస్తుత కాలంలో రైతులంతా పూర్తిగా యాంత్రీకరణ వైపు మొగ్గుచూపడంతో యంత్రాలతోనే వరికోతలు కోస్తున్నారు. దీనివల్ల కోతకోసిన వెంటనే పచ్చిధాన్యం వస్తుంది. పచ్చి ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉంటుంది.

ముమ్మరంగా మాసూళ్లు

నియోజవర్గంలో ముమ్మరంగా మాసూళ్లు చేపట్టారు. మెట్టప్రాంతమైన గూడెం మండలంలో ఇప్పటికే మాసూళ్లు 90 శాతం పూర్తయ్యాయి. డెల్టా ప్రాంతమైన పెంటపాడు మండలంలో 40 శాతం మాసూళ్లు పూర్తయ్యాయి. మిగతా శాతం పూర్తి చేసేందుకు రైతులు హడావుడిగా రాత్రి, పగలు తేడా లేకుండా ఉన్నారు. గత రెండు రోజుల నుంచి ఉదయంనుంచి సాయంత్రంవరకు ఎండసరిగ్గా లేక ఉక్కపోత ఉండి, సాయంత్రం ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. కాగా మాసూళ్లు చేసేందుకు రైతులు పోటీ పడుతున్నారు.

యంత్రాల కోతలకే ప్రాధాన్యం



రైతులు నేడు కూలీలతో కోతలు కోయించే కంటే యంత్రాల ద్వారా కోసిన వాటికే ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అదే రైతులకు మేలు. యంత్రాలు మాత్రం బిజీగా ఉన్నాయి. పగలు ఖాళీ లేకపోతే రాత్రిళ్లు కూడా యంత్రాలతో కోతలు చేపడుతున్నారు.

– కె. పార్థసారధి, వ్యవసాయాధికారి, పెంటపాడు మండలం

పని సులువు అవుతోంది



యంత్రాలతో వరకోతలు కారణంగా పని సులువు అవుతోంది. కూలీలు దొరక్కపోవడంతో ఆఏటాకాయేడు కూలీల ప్రాధాన్యం తగ్గుతోంది. నాట్లకు బెంగాలీ కూలీలు, మిషన్‌ప్లాంటేషన్ ఉంటే, కోతలకు మాత్రం కేవలం యంత్రాలపైనే రైతులు ఆధారపడుతున్నారు. కాగా తేమశాతం తగ్గించేందుకు దాన్యం ఆరబెట్టుకోవాలి. అయినా తప్పట్లేదు.

– పాలా గణపతి, రైతు, బి. కొండేపాడు, పెంటపాడు మండలం

పర్యావరణానికి ప్లాస్టిక్ ప్రమాదకరం



ఆరుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: పర్యావరణానికి ప్లాస్టిక్ ప్రమాదకరమని సర్పంచ్ పీతల బుచ్చిబాబు అన్నారు. సోమవారం మండలంలోని ఆరుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుచ్చిబాబు మాట్లాడుతూ 20 మైక్రాన్ల కంటే తక్కువ బరువున్న ప్లాస్టిక్ భూమిలో త్వరగా మిళితం కాదన్నారు. ఏళ్ల తరబడి భూఆవరణలోనే ఉండిపోతుందన్నారు. అలాగే ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించాలన్నారు. తద్వారా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి టి.రవిచంద్ర, ఎంఆర్సీ ఎం.రవికిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

23న జాబ్ మేళా

పెంటపాడు: మండలంలోని పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 23న ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ దిక్సూచీ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే జాబ్ మేళాకు పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. తగిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా కోరారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు

ఉంగుటూరు: మండలంలోని గోపీనాథ పట్టణంలో శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్ల దివ్య విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవా ఘనంగా జరుగుతున్నాయి. మూడవ రోజు సోమవారం గణపతిపూజ, గోపూజ, మంత్రానుష్టానము, ఏకాదశ రుద్రాభిషేకం, తీర్థప్రసాద వినయోగ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి బింబ సంస్కార హోమాలు, పర్యాయ హోమాలు, మహామృత్యుంజయ హోమం, రుద్ర హోమం, శివపరివార దేవతా హోమం, క్షీరాధివాస హోమం, క్షీరాధివాసము, నీరాజన మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, సాధని కుమారిల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి.

పేదల ఇళ్ల తొలగింపు దారుణం



తాడేపల్లిగూడెం(టీఓసీ): పోలీస్ ఐలాండ్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేస్తున్న దృశ్యం



తణుకు అర్బన్: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాలకోడేరులోని ఎఎస్ఆర్ నగర్‌లో పేదల ఇళ్ల తొలగింపు ఆపాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోమవారం స్థానిక పోలీస ఐలాండ్ వద్ద నిరసన నిర్వహించారు. పట్టణంలో తొలత ర్యాలీ జరిగింది. వక్తలు మాట్లాడుతూ పాలకోడేరు ఎస్ఎస్ఆర్‌లో 1986 నుంచి 130 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, ప్రజలు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారని, ఆదివారం సాయంత్రానికి 42 ఇళ్లు కూలగొట్టారని తెలిపారు. టీడీపీ కూటమి ప్రభుత్వం బుల్డోజర్ రాజకీయాలు ఆపాలని, ఉండి ప్రజా ప్రతినిధి రఘురాంకృష్ణంరాజు ఆరాచాకాలు ఆపాలని హెచ్చరించారు. భూస్వాములు భూములకు మరింత మేలు చేసేందుకు పేదలను ఎమ్మెల్యే రోడ్డు మీద పడేసారని విమర్శించారు. ఆకివీడు నుంచి పాలకోడేరు వరకు కొన్ని వందల పేదల ఇళ్లను దుర్మార్గంగా తొలగిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌లు స్పందించకపోవడం బాధకరమన్నారు. పేదలకు ప్రత్యామ్నాయంగా ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషబాబు, పోతు శ్రీను, పోలా చంద్రశేఖర్, అడపా లోవ, నర్మాల నారాయణరావు, యడవల్లి వెంకట దుర్గారావు, పతివాడ నాగేంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో పేదల ఇళ్ల కూల్చివేతలు ఆపాలి

తణుకు అర్బన్: ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల కూల్చివేతలు తక్షణమే ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ. ప్రతాప్, పట్టణ కార్యదర్శి ఏ.అజయ కుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి స్థానిక అమర వీరుల భవనం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పేదలకు ఇళ్లు నిర్మిస్తామన్న కూటమి ప్రభుత్వం ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్లు కూల్చివేయడం అన్యాయమన్నారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు పేదలపై బుల్‌డోజర్స్‌తో దాడి చేయించడం సిగ్గు చేటని విమర్శించారు. కూటమి నేతలు ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు తీసుకుంటున్న చర్యలను తక్షణమే నిలుపుదల చేయించాలన్నారు. అధికారంలో లేనప్పుడు పేదల గురించి మాట్లాడి, అధికారంలోకి వచ్చాక ఆ పేదలపై దాడి చేయడం బాధాకరమని, ఇప్పటికైనా ఇళ్ల కూల్చివేతలు ఆపాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, గుబ్బల గోపి, వెంకటేశ్వరరావు, బ్రహ్మాజీ, రామకృష్ణ, త్రిమూర్తులు, రమేష్, నాగరత్నం, శ్రీనివాస్‌రాజు, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఇంటర్ బోధన ఉండాలి



భీమవరంలో నాగేశ్వరరావుని కలిసిన జూ.లెక్చరర్ల సంఘ నాయకులు

పెంటపాడు: ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు పోటీ పరీక్షలను ఎదుర్కొనేలా ఉపాధ్యాయుల బోధన సాగాలని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి ఎ. నాగేశ్వరరావు పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల సంఘ నాయకుల బృందం పెంటపాడుకు చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఎంఈఆర్ దేవరాజు ఆధ్వర్యంలో సోమవారం భీమవరంలో ఆయనను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వివరాలను దేవరాజు వెల్లడించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు ఎక్కువ శాతం చదువుకొనేలా రోల్ పెంచాలన్నారు. దీంతో పాటు, విద్యార్థులను పలు పోటీ పరీక్షలకు సిద్ధపడేలా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. సంఘ ఉపాధ్యక్షుడు వాయునందనరావు, కార్యదర్శి వి. పద్మావతి, సహాయకార్యదర్శి ఎల్. శ్రీనివాస్, కోశాధికారి ఎం. మురళీకృష్ణ, మహిళా కార్యదర్శి మహ్మద్ జబీనా, రాష్ట్ర కౌన్సిలర్ వి. నాగమణి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు



తణుకులో ఇంటర్న్ షిప్ సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో హెచ్ఎం పద్మావతి

తణుకు అర్బన్: సమగ్ర శిక్ష అభియాన్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ వారి ఆదేశాల మేరకు తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ఎడ్యుకేషన్ విభాగంలో పది రోజులపాటు ఇంటర్న్ షిప్ పూర్తి చేసిన సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మావతి అందచేశారు. తణుకు పట్టణంలోని ఒంటెద్దు సోమసుందరరావు మోటార్స్ హీరో షోరూం, టీవీఎస్ కృష్ణ షోరూంలో పది రోజులు ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ ట్రేడ్స్‌లో విద్యార్థులు తర్ఫీదు పొందినట్లు చెప్పారు. ఒకేషనల్ ట్రైనర్స్‌గా వ్యవహరిస్తున్న డి. నారాయణ మూర్తి, బి. దిశేంద్ర నాగవరప్రసాద్ సహకారం అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ జీజే ప్రభువరం, ఉపాధ్యాయులు అక్కింశెట్టి రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శీతల పానీయాలు...

మాతృశ్రీ మహిళా సాధికారత ట్రస్ట్ ఆధ్వర్యంలో తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మూడు రోజులపాటు అందజేసే శీతలపానీయాల కార్యక్రమాన్ని డీవైఈవో డి.మురళీసత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి ఎస్ఎంసీ చైర్మన్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, ఎన్సీసీ, నేవీ, స్కాట్ అండ్ గైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత విద్యపై హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి అప్పలస్వామి

తణుకు అర్బన్ : హైకోర్టు ధర్మాసనం తీర్పు అమలులో భాగంగా విద్యా హక్కు చట్టం 2009ని అనుసరించి 2025 -26 విద్యా సంవత్సరంలో జిల్లాలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లు కచ్చితంగా కేటాయించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి అప్పలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం తణుకు ఎస్ఎన్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతంలో ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయస్థానం ఉత్తర్వులను అమలు చేయాల్సిన బాధ్యత విద్యా శాఖ అధికారులపై ఉందని వారు గుర్తు చేశారు. జిల్లాలో కొన్ని విద్యాసంస్థలు 25 శాతం సీట్లు ఇస్తున్నామని చెబుతున్నారని కానీ గతేడాది అవి నోటిమాటలకే పరిమిత మయ్యాయని ధ్వజమెత్తారు. ఈనెల 28 నుంచి మేనెల 15 వరకు విద్యార్థులు ఈ పథకానికి దరఖాస్తులు చేసుకోవచ్చునని వారుతెలిపారు. దీనిపై విద్యాశాఖ అధికారులు ప్రచారం నిర్వహించి విద్యార్థులు దరఖాస్తు చేసుకునేవిధంగా కార్యాచరణ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్. రవితేజ, వై జీవన్, ఎస్ గణేష్, ఎం దుర్గారావు, ఎం.మణికంఠ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



తణుకులో వసతి గృహం ఆవరణను పరిశీలిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమలవ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం తణుకు మునిసిపాలిటీ పరిధిలోని కొమ్మాయి చెరువుగట్టు సోషల్ వెల్ఫేర్ గరల్స్ హాస్టల్, ఇరగవరం రోడ్డులోని బీసీ గరల్స్ హాస్టల్, బీసీ కాలేజీ గరల్స్ హాస్టల్‌లను ఆయన పరిశీలించారు. వసతి గృహాల ఆవరణల్లో మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్, కిచెన్ రూమ్స్, టాయిలెట్స్, విండోస్‌కి మెషింగ్ ప్రూఫ్, తాగునీటిపై తగు సూచనలిచ్చారు. స్వచ్ఛత నిరంతర ప్రక్రియ అని, హాస్టల్ విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ, వారిని స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొనే విధంగా అలవాటు చేయాలని, ఇలా చేయడం వలన స్వచ్ఛత పట్ల బాధ్యత వస్తుందని, హాస్టల్స్ ఆవరణలో చిన్న చిన్న నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఉపయోగం లేని వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రెటరీ వై.మానిక, జె.శాంత కుమారి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, హాస్టల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్న దోమ పెద్ద ప్రమాదం



పట్టణంలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): చిన్న దోమ పెద్ద ప్రమాదమని ప్రజల భాగస్వామ్యంతో దోమలను నివారిద్దామని, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికడదామని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం కడకట్ల, వీకర్స్‌కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని 1, 2, 32, 33, 35 వార్డులలో వెక్టార్ కంట్రోల్ హైజీన్, ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాలు జరిగాయి. క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం సిబ్బందికి పలు సూచనలు చేశారు. దోమలు ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా, ఫైలేరియాలపై అవగాహన కల్పించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టడంలో ప్రజలకు అవగాహన కల్పిస్తు, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు మల్లికా, జ్యోతి, నరాల జ్యోతి, వెంకటలక్ష్మి, కెంపురత్నం, కృపమ్మ, దుర్గాదేవి, ప్రసన్న, స్వాతి, నీలిమ, కోమలి, దుర్గా, సహాయకులు కాంతారావు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఎప్పుడిస్తారు?



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఎప్పుడిస్తారో స్పష్టం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఇచ్చిన జీఓ తక్షణమే అమలు చేయాలని కోరుతూ సోమవారం సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని, ఇళ్ల స్థలాల వ్యక్తిగత అర్జీలను తహసీల్దార్‌కు అందజేశారు. భీమారావు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలచ్చి పేదల స్వంత ఇంటి కల నెరవేస్తాం అన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అద్దెలు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారని, స్వంత ఇంటి కల నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు వడ్డాది మేరీ, వై.అన్నపూర్ణ, అక్కమ్మ, మాధవి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్ కళా కేంద్రంలో సాహితీ, సాంస్కృతిక సమాహారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక బీవీఆర్ కళా కేంద్రంలో సోమవారం రాత్రి కళాకారులచే నెలవారీ సంగీత, సాహితి, సాంస్కృతిక సమాహారం నిర్వహించారు. బీవీఆర్ వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు పర్యవేక్షించారు. గౌరవ సేవా పురస్కారం ప్రాంతీయ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు బత్తుల ప్రసాద్‌కు, కళా సేవా పురస్కారం సంగీత కళాకారులు యినపకుర్తి వెంకట సత్యనారాయణకు, ఆర్థిక సత్కారం డూప్ డాన్సర్ ఆర్.వెంకటరత్నంలకు అందజేశారు. తొలుత కళాకారులచే నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అభిమానులు, సాహితీ సభ్యులు పాల్గొన్నారు.

సజ్జలను కలిసిన సురేష్

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసినట్లు ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్ తెలిపారు. తణుకులో జరుగుతున్న పలు విషయాలపై చర్చించినట్లు చెప్పారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



పాలూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘు నాయకులు

అత్తిలి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఊపిరి తీయాలనే ఆలోచన మానుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు అన్నారు. సోమవారం అత్తిలి మండలం పాలూరు గ్రామంలో రాచకోడు వద్ద పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాపేటి వెంకట సింహాచలం, మల్లవు సంతోష్‌కుమార్, కోడెల వెంకట విజయకుమారి, మల్లవు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పెద్ద శివాలయంలో విశేష పూజలు

పెంటపాడు: మండలంలోని పెంటపాడు చెక్‌పోస్టు వద్ద పార్వతిరామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.